# కనీస సౌకర్యాలకై ధర్నా



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా

**విజయనగరం, 19-9-16 :**

విజయనగరం శివారులో కాండకరకాంరోడ్‌లో 8 సంవత్సరాలక్రితం అప్పటి ప్రభుత్వం పేదలకు 3050 ఇళ్ళు కేటాయించింది. ఇదేగాక రాజీవ్ గృహకల్ప క్రింద 224 ఇళ్ళ సముదాయం నిర్మించింది. ప్రస్తుతం వేలాదిగా వైఎస్‌ఆర్‌నగర్ కాలనీలో నివాసముంటున్నారు. 8 సంవత్సరాలు కావస్తున్నా కనీస సౌకర్యాలైన రోడ్లు, కాలువలు, తాగునీటి వసతి కల్పించలేదు. ఇక్కడ రేషన్ డిపో కూడా లేదు. తాత్కాలికంగా వేరే వార్డులకు చెందిన డీలర్ కొన్ని కార్డులకు మాత్రమే రేషన్ ఇస్తాడు. త్రాగునీరు కోసం పైపులైన్లు వేసి మధ్యంతరంగా నిలుపుచేశారు. పారిశుధ్యం సమస్య తీవ్రంగా ఉంది. పారిశుధ్యం పనులు 3 వారాలకు ఒకసారి మాత్రమే జరుగుతాయి.

ఈ సమస్యలపై నవయువసమాఖ్య గతంలో కరపత్రం ముద్రించి పంచింది. రెండు, మూడుసార్లు సమస్యల పరిష్కారానికై అధికారులకు వినతిపత్రాలు అందించింది.

ఏఐఎఫ్‌టియు(న్యూ), ఎన్‌వైఎస్ ఆధ్వర్యంలో 19-9-2016న విజయనగరం మున్సిపల్ కార్యాలయం ఎదుట వైఎస్‌ఆర్‌నగర్ కాలనీవాసుల ధర్నా జరిగింది. ధర్నాకు ముందు కాలనీ ప్రధాన రహదారిలోని నెహ్రూ పార్కు వద్ద నుండి ప్రదర్శనగా అత్యధికంగా మహిళలు, ఆటో డ్రైవర్లు మున్సిపల్ కార్యాలయం వద్దకు చేరుకొని ధర్నా నిర్వహించారు. వైఎస్ఆర్ నగర్ కాలనీలో రోడ్లు, కాలువలు నిర్మించాలని, తాగునీరుకై కొళాయిలువేయాలని మున్సిపల్ పాలకవర్గం, అధికార యంత్రాంగం యొక్క నిర్లక్ష్య వైఖరి నశించాలంటూ పెద్దపెట్టున నినదించారు.

దీనితో మున్సిపల్ కమీషనరు ధర్నా వద్దకు వచ్చి వినతిపత్రం స్వీకరించి తాను కాలనీకి వచ్చి సమస్యల పరిష్కారానికై కృషిచేస్తానని, తన పరిధి మించిన సమస్యలను ఎంఎల్‌ఏతో కౌన్సిల్‌తో చర్చిస్తానని హామీ ఇచ్చారు. తదుపరి మున్సిపల్ ఛైర్‌పర్సన్ ధర్నా వద్దకు వచ్చి వినతిపత్రం స్వీకరించారు. ధర్నాలో బాలసంఘం సభ్యులు పాల్గొని నినాదాలు ఇవ్వడం, జనం పాటలు పాడటం అందరిని ఆకట్టుకుంది.

ఈ కార్యక్రమం జయప్రదం కావడానికి వైఎస్ఆర్ నగర్ ఆటోస్టాండ్ డ్రైవర్లు మున్సిపల్ ఆఫీసు వరకు కాలనీవాసులను ఉచితంగా చేరవేసి తిరిగి తీసుకు వెళ్ళారు. ఎన్‌వైఎస్ కార్యకర్తలతో కలసి ఆటోడ్రైవర్లు కాలనీలో ప్రచారం చేశారు. ధర్నా పోస్టర్లను తమ ఆటోలపై అతికించి ప్రచారం చేశారు.

ఈ ధర్నాకు మద్ది అప్పలరాజు (నవయువ సమాఖ్య జిల్లా అధ్యక్షులు), రాఘవ, రహిమాన్ (వైఎస్ఆర్ నగర్ కాలనీ ఆటోస్టాండ్ నాయకులు), ఏఐఎఫ్‌టియు(న్యూ) నాయకులు బి. శంకరరావు, రెడ్డి నారాయణరావు మరియు కాలనీవాసులు నాయకత్వం వహించారు.

oooooo